భారతదేశానికి 'పట్టుకొమ్మలు' అని పలువురు ప్రశంసిస్తూనే వాటి గొడవని ఎవరూ పట్టించుకోని పల్లెటూళ్లెన్నో ఉన్నాయి ఆంధ్రావనిలో. వాటిలో గునుపూడి ఒకటి. అక్కడి ప్రజలంత నాగరికులు కాదు. కొండచరియల్లో ఎండినది ఎండగా, పండినది పండగా దాన్ని ఓరబోసుకుని జీవితాలు వెళ్ళబుచ్చే బడుగు వారు వారు.

## ఆవూ - పులీ కథ

ఆ ఊళ్ళోని ప్రజల్లాగే అక్కడి పశువులు కూడా అమాయక జీవులు. అల్ప సంతోషులూను. ఆ కొండ మీద పెరిగిన గడ్డి మేసి, సెలయేళ్లలో నీరు తాగి యజమానులకి సేవ చేస్తూ జీవితాలు వెళ్ళబెచ్చే మూగజీవులు అవి. ఊరు దాటి, పొలాలు దాటి ఇంకా ఎగువకు కొండ ఎక్కితే బాగా దట్టంగా, గుబురుగా బలిసిన చెట్లతో పెద్ద అడవి ఉంది. అవి సాధువుల్ని హింసించే క్రూరమృగాల కాలవాలం. ఆ మృగాల కన్నిటికీ రాజు పులి. తరతరాలుగా వస్తున్న అధికార ఏకఛత్రాధిపత్యం చేస్తున్నాడా పులిరాజు. పులిరాజు కోపంతో గాండ్రిస్తే అడివిలోని మృగాలు, పొలాల్లో మేసే పశువులేకాక ఊళ్ళోని ప్రజలంతా కూడా భయంతో కంపించిపోతారు. భూమి దద్దరిల్లిపోతుంది. ఆ రాజ్యపు చరిత్ర ఇది!

* * *

తర తరాల నాటి మాట........

ఓ నాడు ఓ గంగిగోవు పొలాల్లో మేస్తూ మేస్తూ ఆదమరచి అనువుగాని సమయంలో తన కనువుగాని అడివి దాకా పోయింది. అక్కడ స్వేచ్ఛా విహారం చేస్తున్న పులిరాజు కంటపడింది. ఈ మధ్యనే పిల్లల్నికన్న బాలెంత. నిండిన పొదుగుతో, తెల్లగా నిగ నిగ లాడుతూ కనిపించడంతో పులిరాజుకి నోట్లో నీళ్ళూరసాగాయి. 'ఆహా? ఇలాంటి గోమాంసం రుచి చూడని పులి జన్మ వ్యర్థం' అనుకున్నాడు. అనుకుని దారికడ్డం నిలిచి "తినేస్తా" నని హుంకరించాడు. గంగి గోవు తన రాక కోసం ఎదురు చూస్తున్న పసికందు 'అంబా' అన్న పిలుపు తలుచుకోగానే చేసిన పొదుగులో పాలు చిప్పిల్లాయి.

రాబోయే ఆపదని తలుచుకుని, చంటి పాప అనాథ అయ్యే దుస్థితి హృదయాన్ని కరిగించగా, గంగి, పులి రాజుని ఇలా వేడుకుంది :

"ఓ రాజా! నేను నీ ప్రియమైన ఆహారాన్ని అన్నమాట లోకవిదితము. కనుక నీ కంట బడిన నేను ప్రాణాలతో ఎలాగూ బైటపడేది లేదు. ఇవ్వాళ కాకపోతే రేపైనా నేను నీ చేతుల్లో చావవలసిందే. కాని నాదొక చిన్న విన్నపం ఉంది. కొద్ది రోజుల క్రితమే నాకో చిన్న బాబు పుట్టాడు. ప్రొద్దుటనగా వాడిని ఇంటి దగ్గర వదిలి వచ్చాను. వాడికి ఆకలౌతోందో ఏమో! నా పొదుగులో పాలు ఉబికి పైకి వస్తున్నాయి. నాపై దయ వుంచి నాకు ఒక్కింత వ్యవధి ఇయ్యి. ఇలా ఇంటికి వెళ్ళి బాబుకి పాలు కుడిపి, అలా తిరిగి వొచ్చి ఆనందంగా నా శరీరాన్ని నీ కర్పిస్తాను."

ఆ మాటలు విన్న పులిరాజు కొంచెం ఆలోచనలోపడ్డాడు. 'ఎంత కరకు గుండె అయినా, కన్న కడుపు తీపి తనకు తెలియనిది కాదు. అంతేకాక ఈ బడుగు జాతి పశువులు మా అటవిక మృగాల్లా కాదు. అన్నమాట నిలబెట్టుకోవడం కోసం ప్రాణాలైనా అర్పించే రకం. కనక ఈ గంగి తన చేజారిపోతుందనే బెంగ లేదు. ఒకవేళ పోతే మాత్రం? అదెంత కాలం. దాన్ని నా పంజాతో ఇరికించడం నాకు వెన్నతో పెట్టిన విద్య. అయినప్పటికీ నా హృదయం కరిగిన వైనం దానికి తెలియనివ్వకూడదు' అని నిశ్చయించుకుని గంగితో గంభీరంగా ఇలా అన్నాడు :

"నువ్వింతగా ప్రాధేయపడుతున్నావు కాబట్టి అంగీకరిస్తున్నాను. నువ్వు నీ పని చూసుకుని వెంటనే తిరిగి రావాలి సుమా! నా కసలే కోపం ఎక్కువ. తిరిగి రాకపోయావో నీ వంశాన్నే సమూలంగా నాశనం చేసేస్తాను. జాగ్రత్త! వెళ్ళిరా! నేనిక్కడే నీ కోసం మాటువే సుక్కుచుంటాను."

ఆ చల్లని మాటలు విన్న గంగి పులిరాజుకి కృతజ్ఞతలు చెప్పుకుంటూ వంగి, వంగి నమస్కరిస్తూ పరుగు పరుగున ఇంటి ముఖం పట్టింది.

ఇంటి దగ్గర బుజ్జాయికి పాలిస్తూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది గంగి.

"అమ్మా! ఏడుస్తున్నావేమే?" అని అడిగిన బుజ్జాయికి "నాయనా! ఇహ నుంచీ నీ మంచి చెడ్డలన్నీ నువ్వే చూసుకోవాలి. నేను పులిరాజుకి ఆహారంగా పోతున్నాను. ఇది మన సంప్రదాయం. గోజాతిలో పుట్టినందుకు మనకీ శిక్ష ఎప్పటికైనా తప్పదు. నా జీవితం ఇలాగైంది. నువ్వైనా పులి వాత పడకుండా తప్పించుకోగలిగితే నాకదే చాలు" అని జవాబు చెప్పి దీవించి తాను అడవికి వెళ్ళింది.

అన్నమాట తప్పకుండా వచ్చిన ఆవుని చూసి రాయిలాంటి పులిరాజు గుండెకాయ కరిగి నీరైపోయింది. 'ఏ జన్మలోనో చేసిన పాపానికి గోవుల్ని చంపుకుతినే పులినై పుట్టాను. ఇప్పుడింకా ఇలాంటి పాపాలు చేసి ఎంతటి నికృష్టపు జన్మనెత్తాలో!' అని మధనపడి, మనసు మార్చుకుని గంగిని ఆప్యాయంగా నిమిరి, "నీ బాబుతో ఆడుకో! పో!" అని త్రిప్పి పంపింది.

అవకాశం వచ్చింది కదా ఇదే అదననుకుని ఆ గోవు పారిపోనూ లేదు. చేజిక్కినప్పుడే తొక్కి పెట్టాలిగాని మళ్ళీ ఇది నాకు చిక్కుతుందా అని పులి ఆలోచించనూ లేదు.

తర తరాల నాటి మాట అది...... ...... .......

* * *

తరాలు మారాయి. తరాలలో అంతరాలు వచ్చాయి. విలువలు మారాయి. వృత్తులు మారాయి. ప్రవృత్తులు మారాయి. ఏం మారినా ..... ..... .....

పులి కడుపున పులి పిల్లలే పుడుతున్నాయి. గోవుల కడుపున గోవులే పుడుతున్నాయి.

గునుపూడిలో గోవుల సంఖ్య పెరిగింది. పెనుగొండ మీద పులుల సంఖ్య తగ్గింది. ఎప్పుడో ఒకటి రెండు తప్ప గోవులు పులి కంట పడటం లేదు. పడినా తప్పించుకు పారిపోతున్నాయి. ఎప్పుడూ మందలు మందలుగా వచ్చి మేస్తున్నాయి. అదాటుగా వచ్చి కాటు వేయడానికి పులిరాజుకి అవకాశం లేదు. ఒంటరి గోవుని వేటాడినంత సులభంగాదు మంద మీద దాడి చేయడం. అందుచేత పులిరాజుకి అక్కసుగా ఉంది.

గోవులకైతే చాలా సంతోషంగా ఉంది. ఈ దెబ్బతో పులిరాజు పని గోవిందా! అని ఆనందిస్తున్నాయి. ఆకలితో వాడు మాడి చావవలసిందే అని సంబరపడుతున్నాయి. సామూహికంగా, సంఖ్యాబలం పెంచుకుని జీవించడంలో ఉన్న ప్రత్యేకత వాటికి బాగా తెలిసివచ్చింది. ఇంక మనం కోటలో పాగా వేసినట్టే! పులిరాజు ఆట కట్టేసినట్టే! అనే ఉత్సాహంతో ముందు ముందుకు ఇంకా అడవిలో దాకా చొచ్చుకుపోయి మేసి రాసాగాయి.

పులిరాజుకి పీకల దాకా కోపం వచ్చేస్తోంది. నా అరుపు వింటేనే ఆమడ దూరం పారిపోయే ఈ జాతి ఏం జూసుకుని ఇంత ధైర్యంగా నా రాజ్యంలోకి చొరబడుతోంది? వీటికి బాగా గుణపాఠం నేర్పాలి. ఇలా నేను చేతులు ముడుచుక్కూచుంటే మొత్తం నా ఉనికికే నష్టం వచ్చేటట్టుంది. ఏదో చేయాలి. ఎలాగో ధైర్యం చేయాలి, తప్పదు అని ఆలోచించిన పులిరాజు ఓ రోజున ముందూ వెనకా చూడకుండా మొత్తం మంద మీదే విరుచుకుపడ్డాడు. అనుకోకుండా ఆపద వచ్చినప్పటికీ, గోవులన్నీ ఒక్కుమ్మడిగా పులిరాజు మీద తిరగబడ్డాడు. ఆత్మరక్షణ కోసం దేవుడిచ్చిన కొమ్ములతో పులిరాజుని కుమ్మాయి. అయనప్పటికి పులిరాజు ధాటికి, పులిరాజు దెబ్బకీ తట్టుకోలేక కొన్ని నేల కొరిగాయి. కొన్ని మరీ పిరికి గోవులు తోకలు ముడిచి వెనుదిరిగి చూడకుండా పారిపోయాయి. వాటి బలగం తగ్గడంతో పులిరాజు మరీ విజృంభించి మిగిలిన వాటి ప్రాణాలు మింగడంలో కృతకృత్యు డయ్యాడు. కానీ ఈసారి పోరాటం మరీ ఒక ప్రక్కగానే జరగలేదు. పులిరాజు బాగా గాయపడ్డాడు. కాలు విరిగి కన్ను లొట్టబోయింది. గెలిచానన్న తృప్తికంటే తగిలిన గాయాల బాధ ఎక్కువైంది. కుంటు కుంటూ, ముక్కు కుంటూ అడివిలోకి జారుకున్నాడు.

* * *

కాలం తన ధర్మాన్ని నెరవేరుస్తోంది.

ఏళ్ళూ, పూళ్ళూ గడుస్తున్నాయి.

పులిరాజు మందల మీద దాడి జరిపినప్పుడు తగిలిన గాయాల్ని నాలుకతో నాక్కుంటూ, మాన్పుకునే ప్రయత్నం చేస్తున్నాడు. గాయాలు పూర్తిగా మానకుండానే మళ్ళీ గాయాలవుతున్నాయి. కానీ పులిరాజు తన పట్టుదల వదిలి పెట్టడం లేదు. 'ఎంతకాలం ఇలా జరుగుతుంది. ఎప్పటికైనా గోవులే లొంగి పోవాలి. అదే అనాదిగా వస్తున్న ఆచారం!' అని పులిరాజు ధైర్యం.

* * *

ఆనాడు ఆవుల మందలన్నీ పులిరాజుతో ఘోరంగా పోరాడటం, అన్యాయంగా తమవారంతా బలైపోవడం, అల్లంత దూరాన్నుంచి చూసిన లేగ దూడలు, అక్కణ్నుంచే కన్నీళ్ళతో ఊళ్ళోకి తిరిగి వెళ్ళిపోయాయి. నీళ్ళైనా ముట్టకుండా మోరలెత్తుకుని ఆలోచించ సాగాయి. ఎలాగైనా ఈ వ్యవస్థని తారుమారు చేయాలి. పులిరాజు చేసే దురాగతాలు ఇక్కడితో ఆగాలి. ఈ దారుణం ఇంకా ఎంత కాలం ఇలా సాగుతుంది? ఇకపై సాగకూడదు. తమ పూర్వీకులు ప్రారంభించి, సగంలో వారే సమిధలై వదిలేసిన యజ్ఞాన్ని తాము చేపట్టి ముందుకు సాగించాలి. పులిరాజుని ఈనాటి తమ స్థానంలో నిలబెట్టి వాడి మీసాలతో చెలగాట మాడాలి. ఆ రోజు రావాలి! ఆ రోజు వేగంగా రావాలి.

ఇలా ఆలోచిస్తూ భవిష్యత్తులోకి ప్రయాణిస్తున్న వారి మనోఫలకం మీద చక్కని కల. తీయని కల. కల్ల లాంటి కల. మరువలేని కల. నమ్మలేని నిజంలాంటి కల.... ....

అప్పుడక్కడ గోవుల రాజ్యం నడుస్తోంది. పులులు నక్కుతూ భయం, భయంగా నడుస్తూ గడ్డి మేస్తున్నాయి. గోవులొస్తున్నాయంటే భయంతో తోకలు ముడిచి పారి పోతున్నాయి. గోవులు గట్టిగా హుంకరిస్తే హడలిపోతున్నాయి పులులు. ఒక్కొక్క గోవు నాలుగేసి పులుల్ని అమాంతంగా కొమ్ములతో కుమ్మేసి చంపేస్తోంది. పాత పగలు గుర్తుకువచ్చి ద్విగుణీకృతమైన కసితో నలిపి చంపేస్తున్నాయి పులుల్ని గోవులు. లేగలు వచ్చీరాని కొమ్ముల్తో పులుల్ని బెదిరిస్తుంటే గుర్రుమని చూడడం తప్ప ఏమి చెయ్యలేక పోతున్నాయి. తమ కళ్ళ ముందే తమ జాతిని గోవులు హింసిస్తుంటే నిస్సహాయులై చూస్తూ ఊరుకుంటున్నాయి పులులు. 'గోవుల కింతటి బలం ఎలా వచ్చిందా!' అని ఆశ్చర్య పోతున్నాయి.

* * *

*ఈ కథకిది ముగింపా?*

కానే కాదు.

అయివుంటే ఇది అంతులేని కథ. గోవులపై పులులు, పులులపై గోవులు, గోవులపై పులులు - మళ్ళీ ఇదే కథ పునరావృతం అవుతుంది. ఈ విషవలయానికి విరుగుడు ఎక్కడ? ఏది విరుగుడు? ఎప్పుడు? పులితో గోవు, గోవుతో పులి, ఈ జాతితో అది, ఆ జాతితో ఇది పోరాడి సాధిస్తున్నది ఏమిటి? హింసకి పట్టం కట్టడమేనా? అసలు ధ్యేయం

ఏమిటి? ఎవరి పొట్ట వారు పోసుకుని ప్రశాంత జీవనం గడపాలని కదా? అయితే ఈ మారణ హోమం ఎందుకు?

ఎక్కడో కథ దారి తప్పింది. పెడదారి పట్టింది. దాన్ని దారి మళ్ళించి మళ్ళీ పట్టాల మీద నిలబెట్టాలి.

ఎలా? ఎలా?

ఇది సాధ్యం కాని పని. ఎందుకంటే ఆవులు గడ్డి తిని బ్రతగ్గలవు. కాని పులులు గడ్డి తినలేవు. ఆవుల్ని తినే బ్రతకాలి. ఆవులు మూకుమ్మడిగా ధ్వజమెత్తినా, పులి తన బ్రతుకు తెరువు కోసం దొంగ దెబ్బ తీయక మానదు.

అందుకని ఈ హింసాకాండ సమసిపోయి శాంతి స్థాపన జరగాలంటే పులి జాతిని పూర్తిగా నేలమట్టం చెయ్యాలి.

ఇది సాధ్యమా అంటే సాధ్యం కావొచ్చు. కానైతే శాంతి స్థాపన జరిగిన తర్వాత, పులి భయం పోయిన గోవుల్లోంచి పొడిచే ఆవులు పుట్టుకొస్తే ఏం చేసేది? ✷